# తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU

TELTEL/2023/88710

తెలుగు దిన పత్రిక


ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

వరంగల్ | బుధవారం - 15- జూలై 2026 | సంపుటి : 4 | సంచిక : 41 | పేజీలు - 8 | వెల : రూ 7 | www.telanganamuchatlu.in


## పాఠశాలల్లో లైంగిక విద్యకు
# కేంద్రం ప్రతిపాదన

**సుప్రీంకోర్టుకు కేంద్రం నివేదిక** 2లో

**పిల్లల భద్రత, అవగాహనకు కొత్త పాఠ్యాంశాలు**







# రామంతాపూర్ చెరువుకు విముక్తి

- హైడ్రా భారీ ఆక్రమణల తొలగింపు
- చెరువు పరిధిలోకి 2,180 గజాల భూమి

**హైదరాబాద్, జూలై 14 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ నియోజకవర్గంలోని రామంతాపూర్ పెద్దచెరువు పరిరక్షణలో భాగంగా హైడ్రా మంగళవారం భారీ ఎత్తున ఆక్రమణలను తొలగించింది. చెరువు పూర్తి స్థాయి నీటి విస్తీర్ణాన్ని పునరుద్ధరించే చర్యల్లో భాగంగా మొత్తం 2,180 గజాల మేర ఆక్రమిత భూమిని తిరిగి చెరువు పరిధిలోకి తీసుకువచ్చింది. ఈ చర్యలతో చెరువు అభివృద్ధి పనులకు ఉన్న ప్రధాన అడ్డంకులు తొలగినట్లు అధికారులు తెలిపారు. రామంతాపూర్ పెద్దచెరువు పూర్తి స్థాయి నీటి విస్తీర్ణం 30 ఎకరాలు కాగా, అందులో సుమారు 16 ఎకరాల భూమి ఆక్రమణలకు గురైనట్లు అధికారులు గుర్తించారు. ఈ ఆక్రమిత ప్రాంతంలో దాదాపు 12 ఎకరాల మేర శాశ్వత నిర్మాణాలు ఉండగా, మిగిలిన నాలుగు ఎకరాల్లో తాత్కాలిక షెడ్లు, గుడిసెలు ఏర్పాటయ్యాయి. చెరువును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసే క్రమంలో ఆక్రమణల తొలగింపు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా నిర్మాణంలో ఉన్న సుమారు 1,900 గజాల వాణిజ్య భవనాన్ని హైడ్రా బృందాలు కూల్చివేశాయి. అలాగే 280 గజాల విస్తీర్ణంలో ఉన్న ఆటో గ్యారేజీని కూడా తొలగించాయి. ఈ రెండు నిర్మాణాలు చెరువు పూర్తి స్థాయి నీటి విస్తీర్ణంలో ఉండటంతో చట్టపరమైన చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. చెరువు పరిసరాల్లో నివసిస్తున్న నిరుపేద కుటుంబాల పరిస్థితిని కూడా హైడ్రా పరిగణనలోకి తీసుకుంది.

మిగతా 2లో

# బ్రిక్స్ వేదికపై భారత్ ప్రగతి

- మోదీ నాయకత్వాన్ని ప్రశంసించిన కేంద్ర మంత్రి
- బ్రిక్స్ దేశాల మధ్య పరస్పర సహకార ఆవశ్యకత
- సాంకేతికతతో పారదర్శక సంస్కరణలు
- ఉమ్మడి కార్యాచరణపై ప్రతినిధుల చర్చలు



**హైదరాబాద్, జూలై 14 (తెలంగాణ ముచ్చట్లు):**

హైదరాబాద్ పర్యటనలో ఉన్న కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ బ్రిక్స్ ట్రేడ్ యూనియన్ ఫోరమ్‌ను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా సామాజిక భద్రత, కార్మిక సంక్షేమం, ఉపాధి రంగాల్లో భారత్ సాధిస్తున్న పురోగతిని ఆయన ప్రస్తావించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో సామాజిక భద్రత రంగంలో దేశం గణనీయమైన పురోగతి సాధించిందని మన్‌సుఖ్ మాండవీయ పేర్కొన్నారు. కోట్లాది మంది కార్మికులు, అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ పథకాల ప్రయోజనాలు చేరేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. బ్రిక్స్ దేశాల మధ్య కార్మిక సంక్షేమం, సామాజిక భద్రత, నైపుణ్యాభివృద్ధి వంటి అంశాల్లో పరస్పర సహకారం మరింత

మిగతా 2లో

# బ్రిక్స్ సదస్సుకు హైదరాబాద్ వేదిక

- మన్‌సుఖ్ మాండవీయ ప్రారంభోత్సవం
- వివేక్ వెంకటస్వామి పాల్గొన్న ప్రారంభ కార్యక్రమం

**హైదరాబాద్, జూలై 14 (తెలంగాణ ముచ్చట్లు):**

హైదరాబాద్‌లోని మారియట్ హోటల్‌లో మంగళవారం ప్రతిష్ఠాత్మక బ్రిక్స్ ట్రేడ్ యూనియన్ ఫోరం సమ్మిట్-2026 ఘనంగా ప్రారంభమైంది. జూలై 14 నుంచి 16 వరకు మూడు రోజుల పాటు జరిగే ఈ అంతర్జాతీయ సదస్సును కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ,

మిగతా 2లో



## వెలుగులోకి రాజ్‌కుమార్ సెల్ఫీ వీడియో

- హత్యలకు ముందు రోజు ఆవేదన
- మోసపోయానంటూ వీడియోలో వ్యాఖ్యలు

**హైదరాబాద్, జూలై 14 (తెలంగాణ ముచ్చట్లు):**

షాబాద్‌లో సంచలనం సృష్టించిన బహుళ హత్యల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. నిందితుడు రాజ్‌కుమార్ హత్యలకు ఒక రోజు ముందు, జూలై 10న రికార్డు చేసిన సెల్ఫీ వీడియో వెలుగులోకి వచ్చింది.

మిగతా 2లో






# సింగరేణికి కేంద్రం భరోసా

## కిషన్ రెడ్డి భరోసా యాత్ర కొనసాగింపు
## బీఆర్ఎస్, కాంగ్రెస్‌పై కేంద్ర మంత్రి విమర్శలు

**గోదావరిఖని, జూలై 14 (తెలంగాణ ముచ్చట్లు):**

సింగరేణి సంస్థ బలోపేతం, కార్మికుల సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. తాడిచెర్ల-2 బొగ్గు బ్లాక్‌ను సింగరేణి సంస్థకు కేటాయించిన కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు చేపట్టిన సింగరేణి భరోసా యాత్ర రెండో రోజు రామగుండం, గోదావరిఖనిలో కొనసాగింది. యాత్రకు సింగరేణి కార్మికులు, స్థానిక ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి మాట్లాడిన కిషన్ రెడ్డి, సింగరేణి సంస్థ ఆర్థికంగా బలోపేతం కావడానికి, కార్మికుల భవిష్యత్తు మరింత భద్రంగా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోందని తెలిపారు. తాడిచెర్ల-2 బొగ్గు బ్లాక్ కేటాయింపుతో సంస్థకు దీర్ఘకాలికంగా బొగ్గు నిల్వలు అందుబాటులోకి వస్తాయని, ఉపాధి అవకాశాలు కూడా విస్తరిస్తాయని పేర్కొన్నారు.

మిగతా 2లో

# ఎస్ఐఆర్ గడువు పెంచాలన్న కాంగ్రెస్

- పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో ఈసీకి వినతి
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని కలిసిన నేతలు

**హైదరాబాద్, జూలై 14 (తెలంగాణ ముచ్చట్లు):**

ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం గడువును పొడిగించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్ రెడ్డిని హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం కలిసి విజ్ఞప్తి చేశారు. ఓటర్ల నమోదు ప్రక్రియలో ప్రజలకు మరింత అవకాశం కల్పించేందుకు గడువు పెంపు అవసరమని ఆయన కోరారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు ఎమ్మెల్సీలు అద్దంకి

మిగతా 2లో



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## పాఠశాలల్లో లైంగిక విద్యకు
# కేంద్రం ప్రతిపాదన

న్యూఢిల్లీ, జూలై 14 (తెలంగాణ ముచ్చట్లు):



దేశవ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల్లో వయస్సుకు తగిన సమగ్ర లైంగిక విద్యను ప్రవేశపెట్టాలని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెల్లడించింది. 26 మంది సభ్యులతో కూడిన జాతీయ నిపుణుల కమిటీ సిఫారసుల మేరకు రూపొందించిన ఈ కార్యక్రమాన్ని సుప్రీంకోర్టు ఆమోదించిన అనంతరం అమలు చేయనున్నట్లు తెలిపింది. పిల్లల భద్రత, ఆరోగ్యకరమైన వికాసం, లైంగిక దాడుల నుంచి రక్షణపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొంది. జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఆర్. మహదేవన్ ధర్మాసనం ముందు అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి ఈ వివరాలను వెల్లడించారు. జాతీయ నిపుణుల కమిటీ సమర్పించిన సిఫారసులను కేంద్ర ప్రభుత్వం ఆమోదించినట్లు కోర్టుకు తెలియజేశారు. పిల్లలకు వయస్సుకు అనుగుణంగా అవగాహన కల్పించే విధంగా దేశవ్యాప్తంగా ఒకే విధమైన పాఠ్య ప్రణాళిక రూపొందించాలని కమిటీ సూచించినట్లు పేర్కొన్నారు.

ప్రాథమిక స్థాయి నుంచే సమగ్ర లైంగిక విద్యను పాఠ్యాంశాల్లో చేర్చాలని నివేదికలో ప్రతిపాదించారు. వారానికి కనీసం రెండు రోజులు 15 నుంచి 20 నిమిషాల పాటు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, ఇందుకోసం ప్రతి పాఠశాలలో ప్రత్యేక శిక్షణ పొందిన ఉపాధ్యాయుడిని నియమించాలని కమిటీ సిఫారసు చేసింది. ఈ పాఠ్యాంశాల్లో శరీర భద్రత, వ్యక్తిగత పరిశుభ్రత, శరీర భాగాలపై అవగాహన, సురక్షితమైన మరియు అసురక్షితమైన స్పర్శను గుర్తించడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. విద్యార్థుల వయస్సు పెరిగే కొద్దీ కౌమార ఆరోగ్యం, సంబంధాలు, జీవిత నైపుణ్యాలు వంటి అంశాలను కూడా దశలవారీగా బోధించేలా ప్రణాళిక రూపొందించారు. తల్లిదండ్రులు, సంరక్షకులు, ఉపాధ్యాయుల కోసం కూడా క్రమం తప్పకుండా అవగాహన సమావేశాలు నిర్వహించాలని కమిటీ సూచించింది. పిల్లల ఎదుగుదల దశలు, వారి భద్రత, శారీరక-మానసిక శ్రేయస్సును కాపాడడంలో కుటుంబ సభ్యుల పాత్రపై అవగాహన కల్పించడమే ఈ సమావేశాల లక్ష్యమని పేర్కొంది. మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి నేతృత్వంలో ఏర్పాటైన ఈ కమిటీలో విద్యా, మానసిక ఆరోగ్య, న్యాయ నిపుణులు, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు, జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు పాల్గొన్నారు. మైనర్లపై లైంగిక నేరాల నివారణ, పిల్లల భద్రత, కౌమార దశలో సరైన అవగాహన కల్పించేందుకు సమగ్ర విధానాన్ని రూపొందించాలన్న సుప్రీంకోర్టు సూచనల మేరకు ఈ ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది.

## వెలుగులోకి రాజ్‌కుమార్ సెల్ఫీ వీడియో

(మొదటి పేజీ తరువాయి)



ఆ వీడియోలో తన జీవితంలో ఎదురైన ఆర్థిక ఇబ్బందులు, వ్యక్తిగత సమస్యల గురించి తీవ్ర ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. వీడియోలో యువతిని నమ్మి అన్ని విధాలుగా మోసపోయానని, ఆమె కుటుంబానికి పెద్ద మొత్తంలో డబ్బులు ఇవ్వడంతో అప్పుల పాలయ్యానని రాజ్‌కుమార్ పేర్కొన్నట్లు సమాచారం. ఆ పరిణామాల వల్ల తన కుటుంబం తీవ్ర ఇబ్బందుల్లో పడిందని, పిల్లలకు ఇవ్వాల్సిన ఆస్తి కూడా కోల్పోయానని ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. అప్పులు పెరిగిపోవడంతో జీవితంపై విరక్తి కలిగిందని, తన పరిస్థితికి ఆర్థిక సమస్యలే ప్రధాన కారణమని వీడియోలో చెప్పినట్లు సమాచారం. ఈ వీడియో ప్రస్తుతం దర్యాప్తులో కీలక ఆధారంగా మారినట్లు తెలుస్తోంది. అయితే వీడియోలో చేసిన ఆరోపణలు రాజ్‌కుమార్ వ్యక్తిగత వాదనలు మాత్రమేనని, వాటి నిజానిజాలను పోలీసులు దర్యాప్తు ద్వారా నిర్ధారించాల్సి ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ఈ కేసుకు సంబంధించిన అన్ని కోణాలను పరిశీలిస్తూ దర్యాప్తును కొనసాగిస్తున్నారు. షాబాద్ బహుళ హత్యల కేసు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన నేపథ్యంలో ఈ సెల్ఫీ వీడియో బయటకు రావడం మరింత చర్చనీయాంశమైంది. ఘటనకు దారితీసిన పరిస్థితులు, ఆర్థిక లావాదేవీలు, ఇతర కారణాలపై పోలీసులు లోతుగా విచారణ చేపట్టారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తున్న పోలీసులు వీడియోతో పాటు ఇతర డిజిటల్ ఆధారాలను కూడా పరిశీలిస్తున్నారు. దర్యాప్తు పూర్తయిన తర్వాతే ఘటనకు దారితీసిన అసలు కారణాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

# రామంతాపూర్ చెరువుకు విముక్తి

(మొదటి పేజీ తరువాయి)



వర్షాకాలంలో చెరువు నిండితే గుడిసెలు నీట మునిగి ప్రతి ఏడాది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను మంజూరు చేయాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. చెత్త సేకరణ, కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న కుటుంబాలకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించి గృహాల కేటాయింపునకు చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

రామంతాపూర్ పెద్దచెరువు అభివృద్ధికి ప్రభుత్వం సుమారు రూ.19 కోట్లతో పనులు చేపట్టింది. చెరువు పూర్తి స్థాయి నీటి విస్తీర్ణాన్ని పునరుద్ధరించడం, గట్ల బలోపేతం, సుందరీకరణ, పర్యావరణ పరిరక్షణ వంటి పనులు కొనసాగుతున్నాయి. ఆక్రమణలు తొలగించడంతో అభివృద్ధి పనులు వేగవంతం కానున్నాయని అధికారులు వెల్లడించారు. చెరువులను పరిరక్షించడం, వర్షపు నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడం, భూగర్భ జలాలను సంరక్షించడం ప్రభుత్వ లక్ష్యమని హైడ్రా అధికారులు తెలిపారు. నగరంలోని చెరువుల ఆక్రమణలపై ప్రత్యేక దృష్టి సారించి చట్టవిరుద్ధ నిర్మాణాలపై చర్యలు కొనసాగిస్తామని, ప్రజలు చెరువుల పరిరక్షణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# బ్రిక్స్ వేదికపై భారత్ ప్రగతి

(మొదటి పేజీ తరువాయి)

పెరగాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రి అన్నారు. సభ్య దేశాలు అనుభవాలను పంచుకుంటూ సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సామాజిక భద్రత వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు భారత్ చేపడుతున్న సంస్కరణలను ఆయన వివరించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ పారదర్శకంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు.

బ్రిక్స్ వేదిక సభ్య దేశాల మధ్య సహకారాన్ని బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తోందని మన్‌సుఖ్ మాండవీయ పేర్కొన్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణ, సామాజిక భద్రత విస్తరణ, స్థిరమైన ఉపాధి కల్పనపై ఉమ్మడి కార్యాచరణ అవసరమని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో బ్రిక్స్ సభ్య దేశాలకు చెందిన ట్రేడ్ యూనియన్ ప్రతినిధులు, కేంద్ర ప్రభుత్వ అధికారులు, వివిధ రంగాల నిపుణులు పాల్గొన్నారు. కార్మిక సంక్షేమం, సామాజిక భద్రతకు సంబంధించిన పలు అంశాలపై అభిప్రాయాలు పంచుకున్నారు.



# బ్రిక్స్ సదస్సుకు హైదరాబాద్ వేదిక

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి సంయుక్తంగా ప్రారంభించారు.

ప్రపంచ కార్మిక రంగంలో మారుతున్న పరిస్థితులు, కార్మికుల సంక్షేమం, సామాజిక భద్రత, ఉపాధి అవకాశాల విస్తరణ, నైపుణ్యాభివృద్ధి వంటి కీలక అంశాలపై బ్రిక్స్ సభ్య దేశాల ప్రతినిధులు ఈ సదస్సులో చర్చించనున్నారు. పరస్పర అనుభవాలను పంచుకుంటూ ఉమ్మడి కార్యాచరణపై అభిప్రాయాలు వ్యక్తం చేయనున్నారు.

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మన్‌సుఖ్ మాండవీయ మాట్లాడుతూ కార్మిక సంక్షేమం, సామాజిక భద్రత రంగాల్లో భారత్ సాధించిన పురోగతిని వివరించారు. బ్రిక్స్ దేశాల మధ్య సహకారం మరింత బలోపేతమైతే కార్మికుల సంక్షేమానికి కొత్త అవకాశాలు ఏర్పడతాయని అన్నారు. రాష్ట్ర మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి




మాట్లాడుతూ హైదరాబాద్‌కు ఇలాంటి అంతర్జాతీయ సదస్సు ఆతిథ్యం దక్కడం గర్వకారణమని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి కల్పనతో పాటు కార్మిక సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు.

మూడు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో బ్రిక్స్ దేశాలకు చెందిన ట్రేడ్ యూనియన్ ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, కార్మిక రంగ నిపుణులు పాల్గొని వివిధ అంశాలపై చర్చలు జరపనున్నారు. కార్మిక హక్కులు, సుస్థిర ఉపాధి, సామాజిక భద్రత, నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక సమావేశాలు నిర్వహించనున్నారు. ఈ అంతర్జాతీయ సదస్సు ద్వారా బ్రిక్స్ దేశాల మధ్య కార్మిక రంగ సహకారం మరింత బలోపేతం కావడంతో పాటు పరస్పర అనుభవాల మార్పిడికి వేదికగా నిలుస్తుందని నిర్వాహకులు తెలిపారు. హైదరాబాద్ మరోసారి అంతర్జాతీయ సమావేశాలకు ఆతిథ్యం ఇస్తూ తన ప్రత్యేకతను చాటుకుంటోందని పేర్కొన్నారు.

# సింగరేణికి కేంద్రం భరోసా



(మొదటి పేజీ తరువాయి)

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేయడమే కేంద్ర ప్రభుత్వ విధానమని కిషన్ రెడ్డి అన్నారు. సింగరేణి కార్మికుల సంక్షేమం, భద్రత, సంస్థ అభివృద్ధికి అవసరమైన ప్రతి చర్యను కేంద్రం తీసుకుంటోందని స్పష్టం చేశారు. కార్మికుల శ్రమే దేశ పారిశ్రామికాభివృద్ధికి బలమని కొనియాడారు. గతంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు సింగరేణి సంస్థను బలోపేతం చేయకుండా ఆదాయ వనరుగా మాత్రమే ఉపయోగించుకున్నాయని కిషన్ రెడ్డి ఆరోపించారు. సంస్థ ఆదాయాన్ని ఇతర అవసరాలకు మళ్లించడం వల్ల ఆర్థిక పరిస్థితి బలహీనపడిందని, కార్మికుల సంక్షేమం నిర్లక్ష్యానికి గురైందని విమర్శించారు.

ప్రస్తుతం సింగరేణి సంస్థ ఆర్థిక ఇబ్బందులతో ఉద్యోగుల జీతాల చెల్లింపులకు కూడా బ్యాంకుల నుంచి ఓవర్‌డ్రాఫ్ట్ తీసుకునే పరిస్థితి ఏర్పడిందని ఆయన ఆరోపించారు. ఈ పరిస్థితికి గత ప్రభుత్వాల విధానాలే కారణమని పేర్కొన్నారు. సంస్థను తిరిగి గాడిలో పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని హామీ ఇచ్చారు. సింగరేణి భరోసా యాత్ర ద్వారా కార్మికులతో నేరుగా మమేకమై వారి సమస్యలు తెలుసుకుంటున్నట్లు కిషన్ రెడ్డి తెలిపారు. సంస్థ అభివృద్ధి, కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. యాత్రలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, సింగరేణి కార్మికులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ గడువు పెంచాలన్న కాంగ్రెస్

(మొదటి పేజీ తరువాయి)



దయాకర్, బలమూరి వెంకట్, ఎమ్మెల్యేలు శ్రీ గణేష్, నవీన్ యాదవ్, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు దీపక్ జాన్, మోత రోహిత్, టీపీసీసీ ఎన్నికల కమిషన్ సమన్వయ కమిటీ చైర్మన్ రాజేష్ తదితరులు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో అర్హులైన ప్రతి ఓటరికి అవకాశం కల్పించేందుకు గడువు పొడిగించాలని ప్రతినిధి బృందం కోరింది. ఎలాంటి అర్హత కలిగిన ఓటరు కూడా జాబితా నుంచి తప్పిపోకుండా ఎన్నికల సంఘం తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది.

ఓటర్ల నమోదు, సవరణ, మార్పులు, కొత్త దరఖాస్తుల పరిశీలనకు మరింత సమయం అవసరమని నేతలు అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు హక్కు అత్యంత కీలకమని, ప్రతి అర్హుడి పేరు ఓటర్ల జాబితాలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని ప్రతినిధి బృందం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి సూచించింది. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేసింది.

ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్ రెడ్డికి తమ వినతిని వివరించిన కాంగ్రెస్ నేతలు, ఎన్నికల సంఘం సానుకూల నిర్ణయం తీసుకుంటుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. గడువు పొడిగింపుపై ఎన్నికల సంఘం నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నట్లు తెలిపారు.

# నూతన ఎంపీడీవోకు దేవస్థానం చైర్మన్ మర్యాదపూర్వక సన్మానం



**జమ్మికుంట టౌన్ జూలై 14 (తెలంగాణ ముచ్చట్లు):** ఇటీవల ఇల్లంతకుంట మండల ఎంపీడీవో (మండల పరిషత్ అభివృద్ధి అధికారి)గా బాధ్యతలు స్వీకరించిన విజయ్‌కుమార్‌ను శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం చైర్మన్ ఇంగిలే రామారావు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం స్వామివారి ప్రసాదంతో పాటు ముత్యాల తలంబ్రాలను అందజేసి ఆశీర్వాదాలు తెలిపారు.
ఈ సందర్భంగా ఇంగిలే రామారావు మాట్లాడుతూ, ఇల్లంతకుంట మండల అభివృద్ధి, గ్రామాల పురోగతి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎంపీడీవో విజయ్‌కుమార్ సమర్థవంతంగా పని చేయాలని ఆకాంక్షించారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తూ, తన పదవీకాలాన్ని విజయవంతంగా నిర్వహించాలని శుభాకాంక్షలు తెలియజేశారు.
ఈ కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్త గొడిశాల పరమేష్, డీసీసీ కార్యదర్శి మేకమల్ల అశోక్, యూత్ కాంగ్రెస్ నాయకుడు ఉప్పుల అమరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రేపు వనపర్తికి ధర్మ సమాజ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డా. విశారధన్ మహారాజ్



**వనపర్తి,జూలై14(తెలంగాణముచ్చట్లు):-** ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్‌పీ) సంస్థాగత బలోపేతం, జిల్లా నూతన కమిటీ ఎన్నిక, పార్టీ విస్తరణతో పాటు భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేసేందుకు పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు డా. విశారధన్ మహారాజ్ బుధవారం ఉదయం 11 గంటలకు వనపర్తికి రానున్నట్లు జిల్లా నాయకులు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు వారు వెల్లడించారు. సమావేశంలో పార్టీ సంస్థాగత నిర్మాణం, గ్రామ, మండల, జిల్లా స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసే అంశాలతో పాటు సభ్యత్వ నమోదు, ప్రజా సమస్యలపై చేపట్టాల్సిన కార్యాచరణ, రానున్న కార్యక్రమాలపై సమగ్రంగా చర్చించనున్నట్లు పేర్కొన్నారు.ఈ సమావేశం వనపర్తి అంబేద్కర్ చౌరస్తాలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల గేటు ఎదురుగా, పంజాబ్ నేషనల్ బ్యాంక్ భవనం పై అంతస్తులో ఉన్న ఎంఎన్‌ఆర్ బ్యాంక్వెట్ హాల్‌లో జరుగుతుందని తెలిపారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, ముఖ్య కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని జిల్లా నాయకులు విజ్ఞప్తి చేశారు.

# ఓటరు జాబితాలో ప్రతి ఒక్కరి వివరాలు సక్రమంగా ఉండేలా చూసుకోవాలి



- **బీఆర్‌ఎస్ పార్టీ బీఎల్‌ఏ మధు**


**పెద్దమందడి,జూలై14(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలో నిర్వహించిన ఓటరు నమోదు సవరణ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ బీఎల్‌ఏ మధు పాల్గొని ఓటర్లను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఓటు హక్కు ప్రతి భారత పౌరుడికి రాజ్యాంగం కల్పించిన అత్యంత విలువైన హక్కు. ప్రతి ఓటరు తమ పేరు, ఫోటోతో పాటు ఇతర వివరాలు ఓటరు జాబితాలో సక్రమంగా ఉన్నాయో లేదో తప్పనిసరిగా పరిశీలించాలి.ఓటరు నమోదు, వివరాల సవరణకు సంబంధించి ఏవైనా సందేహాలు ఉంటే గ్రామ బీఎల్‌వో లేదా బీఎల్‌ఏలను సంప్రదించి వాటిని సరిచేసుకోవాలి. 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రతి యువతి, యువకుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకొని ప్రజాస్వామ్య బలోపేతానికి తన వంతు బాధ్యతను నిర్వర్తించాలి. ప్రతి ఒక్కరూ ఓటరు నమోదు, సవరణ ప్రక్రియను సద్వినియోగం చేసుకొని తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలి అని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌ఎ రఘువర్ధన్ రెడ్డి, వెంకటగిరి శ్యామ్, కానాపురం శీను పాల్గొన్నారు.

# వెల్టూరులో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పరిశీలించిన తహసీల్దార్ మల్లికార్జున్



**పెద్దమందడి,జూలై14(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలంలోని వెల్టూరు గ్రామంలో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని తహసీల్దార్ మల్లికార్జున్ మంగళవారం పరిశీలించారు. కార్యక్రమం నిర్వహణ తీరును క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం కార్యక్రమాన్ని పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సేవలు అందించాలని ఆదేశించారు.అనంతరం కార్యక్రమానికి సంబంధించిన రికార్డులను పరిశీలించి, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. ప్రజలకు అవసరమైన సమాచారం ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని, సందేహాలకు వెంటనే సమాధానాలు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని తహసీల్దార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీ ఎల్ ఓ, బీ ఎల్ ఏ లు, బిజెపి రమేష్ పాల్గొన్నారు.

# 40 ఏళ్ల కాంగ్రెస్‌కు గుడ్‌బై.. బీఆర్‌ఎస్‌లో చేరిన పానుగంటి రాము



**వనపర్తి, జూలై14(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా చిమనగుంటపల్లి గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ కార్యకర్త పానుగంటి రాము తన అనుచరులతో కలిసి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి నిరంజన్ రెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా పానుగంటి రాము మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మేఘా రెడ్డి గెలిస్తే తిరుపతి శ్రీ వెంకటేశ్వరస్వామి వరకు మా గ్రామం నుండి పాదయాత్ర చేస్తామని మొక్కుకున్నామని, ఎమ్మెల్యే విజయం సాధించిన తర్వాత మొక్కు ప్రకారం పాదయాత్ర చేసి స్వామివారిని దర్శించుకున్నామని తెలిపారు. ఎమ్మెల్యే గెలుపు కోసం వ్యక్తిగతంగా శ్రమించడంతో పాటు సొంత డబ్బులు ఖర్చు పెట్టి పార్టీ విజయానికి కృషి చేశామన్నారు..అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్ జెండా మోసిన తమలాంటి కార్యకర్తలను పూర్తిగా విస్మరించారని, ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరిన వారికే పదవులు, ప్రాధాన్యం కల్పిస్తున్నారని ఆరోపించారు. గ్రామస్థాయి కార్యకర్తల మాటకు విలువ లేకుండా పోయిందని, పలుమార్లు సమస్యలను నాయకుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మేఘా రెడ్డి మాటలు నీటి మూటలు అంటూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు కూడా అమలు కాలేదని విమర్శించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయకుండా రైతులు, మహిళలు, నిరుద్యోగులు, కార్మికులు, విద్యార్థులను నిర్లక్ష్యం చేస్తోందని ఆయన ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో రైతులకు మెరుగైన పరిస్థితులు ఉండేవని, ప్రస్తుతం రైతు భరోసా, రుణమాఫీ, రైతు బీమా, యూరియా కొరత, విద్యుత్ కోతలు, ధాన్యానికి గిట్టుబాటు ధర, బోనస్ వంటి అంశాల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.ఈ పరిస్థితుల్లో నియోజకవర్గ అభివృద్ధి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి నాయకత్వంలోనే సాధ్యమనే విశ్వాసంతో మండల నాయకుల సహకారంతో బీఆర్ఎస్ పార్టీలో చేరినట్లు పానుగంటి రాము స్పష్టం చేశారు. పానుగంటి రాముతో పాటు గొర్ల రాము, కొమ్ము నాగయ్య, గార్ల రాము, కురుమయ్య, భగవంతు, నరేష్, అభిషేక్, చరణ్ తదితరులు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో వాకిటి శ్రీధర్, మాణిక్యం, ధర్మా నాయక్, మహేశ్వర్ రెడ్డి, చిట్యాల రాము, ధర్మశాస్త్రి, భగవంతు యాదవ్, శంశుద్దీన్, అంజి, సత్యనారాయణ చారి తదితరులు పాల్గొన్నారు.





# అన్నం పెట్టే అమ్మలకు చీరలతో గౌరవ వందనం

- **సేవా భావాన్ని చాటిన గంగిశెట్టి మధురమ్మ ట్రస్ట్**

**హుజూరాబాద్, జూలై 14 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న వేలాది మంది విద్యార్థులకు ప్రతిరోజూ ప్రేమతో, బాధ్యతతో మధ్యాహ్న భోజనం అందిస్తూ వారి ఆకలి తీర్చే మహిళా సిబ్బంది సేవలను గుర్తిస్తూ గంగిశెట్టి మధురమ్మ ట్రస్ట్ ఆదర్శప్రాయమైన సేవా కార్యక్రమాన్ని నిర్వహించింది. హుజూరాబాద్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన నిర్వాహకులు, హెల్పర్లు, స్కావెంజర్లకు ట్రస్ట్ ఆధ్వర్యంలో చీరలు పంపిణీ చేసి వారి సేవలకు గౌరవం తెలిపింది. హుజూరాబాద్‌లోని శాస్త్ర పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) ప్రశాంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని సుమారు 120 మంది మహిళా సిబ్బందికి చీరలను అందజేశారు. ఈ సందర్భంగా మహిళా సిబ్బందిని శాలువాలతో సత్కరించి వారి సేవలను కొనియాడారు. డీఈవో ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం విజయవంతంగా అమలవడంలో మహిళా సిబ్బంది పాత్ర ఎంతో కీలకమని అన్నారు. ప్రతిరోజూ చిన్నారులకు నాణ్యమైన ఆహారం అందించేందుకు వారు అంకితభావంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. వారి సేవలను గుర్తించి గంగిశెట్టి మధురమ్మ ట్రస్ట్ చీరలు పంపిణీ చేయడం అభినందనీయమని, సమాజంలో సేవా కార్యక్రమాలకు ఇది మంచి ఉదాహరణగా నిలుస్తుందని అన్నారు.
గంగిశెట్టి మధురమ్మ ట్రస్ట్ ప్రతినిధులు మాట్లాడుతూ, సమాజానికి నిస్వార్థంగా సేవ చేస్తున్న మహిళలను ప్రోత్సహించడం తమ ట్రస్ట్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. భవిష్యత్తులో కూడా విద్య, వైద్యం, సామాజిక సేవ రంగాల్లో ఇలాంటి ప్రజాహిత కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని చెప్పారు. చీరలు అందుకున్న మధ్యాహ్న భోజన సిబ్బంది ట్రస్ట్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేశారు. తమ సేవలను గుర్తించి గౌరవించడం ఆనందంగా ఉందని, ఇలాంటి ప్రోత్సాహం తమలో మరింత ఉత్సాహాన్ని నింపుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, గంగిశెట్టి మధురమ్మ ట్రస్ట్ సభ్యులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు, హెల్పర్లు, స్కావెంజర్లు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో సాగి మహిళా సిబ్బందికి గౌరవం తెలిపే వేదికగా నిలిచింది.

# ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్ల సమస్యలు పరిష్కరించాలి

- **హుజూరాబాద్‌లో ర్యాలీ నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత**




**హుజూరాబాద్, జూలై 14(తెలంగాణ ముచ్చట్లు ):** సమాజంలో మధ్యతరగతి జీవితం గడుపుతూ ఉపాధి పొందుతున్న ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని స్వయంకృషి ప్లంబర్ యూనియన్ అధ్యక్షుడు మొరే రవి, ప్రధాన కార్యదర్శి జున్నాతుల శ్రీనివాస్, శుభజ్యోతి ఎలక్ట్రిషియన్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సంగెం వెంకటస్వామి, కార్యదర్శి జున్నాతుల శ్రీనివాస్‌లు డిమాండ్ చేశారు.
మంగళవారం హుజూరాబాద్ పట్టణంలో ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్లు తమ సమస్యల పరిష్కారం కోరుతూ వేర్వేరుగా ర్యాలీలు నిర్వహించారు. అనంతరం హుజూరాబాద్ తహసీల్దార్ జక్కని నరేందర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.
ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్లు కష్టపడి పని చేసుకుంటూ కుటుంబాలను పోషిస్తున్నప్పటికీ పేదరికంలోనే జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి ఇందిరమ్మ ఇళ్లను కేటాయించి తగిన ప్రాధాన్యత కల్పించాలని కోరారు. అలాగే సంఘ భవన నిర్మాణం కోసం ప్రభుత్వ స్థలంలో ఒక గుంట భూమిని కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.
నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిన నేపథ్యంలో ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్లు నిర్ణయించిన కూలి రేట్లను అమలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, ప్రస్తుతం ఉన్న వయోపరిమితిని 60 సంవత్సరాల నుంచి 70 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు.
ఈ కార్యక్రమంలో ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్ వర్కర్స్ అసోసియేషన్‌కు చెందిన నాయకులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు

తెలుగు దిన పత్రిక

# ఇందిరమ్మ ఇళ్లతో పేద కుటుంబాలకు శాశ్వత గూడు



- **23 మంది లబ్ధిదారుల గృహప్రవేశాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**

**పెబ్బేరు,జూలై14(తెలంగాణ ముచ్చట్లు-):**పేద కుటుంబాల సొంతింటి కలను కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సాకారం చేస్తోందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. పెబ్బేరు మండలం కంచిరావుపల్లి తండా, రంగాపురం గ్రామాల్లో మంగళవారం 23 మంది ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుల గృహప్రవేశ కార్యక్రమాలకు ఎమ్మెల్యే హాజరై, నూతన వస్త్రాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఇంటిలో అడుగుపెట్టిన లబ్ధిదారులు ఆనందంతో భావోద్వేగానికి గురయ్యారు. ఎన్నో సంవత్సరాలుగా పూరి గుడిసెలు, రేకుల ఇళ్లలో పాములు, తేళ్లు, విషపురుగుల భయంతో జీవించామని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తమ సొంతింటి కల నెరవేరిందని వారు తెలిపారు. గత పాలకులు తమ సమస్యలను పట్టించుకోలేదని, ప్రస్తుతం ప్రభుత్వం గౌరవప్రదమైన నివాసాన్ని కల్పించి తమ జీవితాల్లో వెలుగులు నింపిందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీకి జీవితాంతం రుణపడి ఉంటామని, తమ కుటుంబాలకు భద్రత, గౌరవం కల్పించిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ.. పేదల సొంతింటి కలను సాకారం చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధిని సమానంగా ముందుకు తీసుకెళ్తూ ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ ఫలాలు చేరేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రమోదిని రెడ్డి, వైస్ చైర్మన్ విజయవర్ధన్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జాపర్ల రాంరెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు దయాకర్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి, సురేందర్ గౌడ్, రంజిత్ కుమార్, యుగేందర్ రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటికీ రక్షిత తాగునీరు

- **గూడెం మహిపాల్ రెడ్డి శంకుస్థాపన**
- **రూ.55 లక్షల పైప్‌లైన్ పనులకు శ్రీకారం**

**అమీన్పూర్, జూలై 14 (తెలంగాణ ముచ్చట్లు):** అమీన్పూర్ సర్కిల్ పరిధిలోని ప్రతి ఇంటికి స్వచ్ఛమైన, రక్షిత తాగునీరు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. అమీన్పూర్ డివిజన్‌లోని టైలర్స్ కాలనీలో జలమండలి ఆధ్వర్యంలో రూ.55 లక్షల వ్యయంతో చేపట్టనున్న తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజలకు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం మౌలిక సదుపాయాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. వేగంగా విస్తరిస్తున్న అమీన్పూర్ ప్రాంతంలో పెరుగుతున్న జనాభా అవసరాలను దృష్టిలో ఉంచుకుని తాగునీటి సరఫరాను మరింత బలోపేతం చేయడానికి కొత్త పైప్‌లైన్ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు.

రూ.55 లక్షల వ్యయంతో చేపడుతున్న ఈ పనులు పూర్తయిన తర్వాత టైలర్స్ కాలనీ ప్రజలకు తాగునీటి సమస్య పూర్తిగా పరిష్కారమవుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రతి ఇంటికి నిరంతరాయంగా నాణ్యమైన తాగునీరు అందేలా జలమండలి అధికారులు పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించేందుకు రహదారులు, మురుగునీటి కాలువలు, తాగునీటి సౌకర్యాలు, విద్యుత్ వంటి మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ప్రతి కాలనీని అన్ని వసతులతో కూడిన ఆదర్శ నివాస ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని, నిర్ణీత గడువులోపు పైప్‌లైన్ నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో ఎలాంటి రాజీ ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, జలమండలి జనరల్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ జనరల్ మేనేజర్ శివ, సహాయ ఇంజినీర్ శ్రీకాంత్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, కాలనీ ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.









# సింగిల్-యూజ్ ప్లాస్టిక్‌కు జమ్మికుంటలో నో ఎంట్రీ.. తనిఖీలు ముమ్మరం

**జమ్మికుంట టౌన్ జులై 14 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట పట్టణాన్ని సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు మున్సిపల్ యంత్రాంగం చర్యలను ముమ్మరం చేసింది. మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి ఆదేశాల మేరకు మంగళవారం పట్టణంలోని వారసంతతో పాటు ప్రధాన వాణిజ్య ప్రాంతాల్లో మున్సిపల్ అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా దుకాణదారులు, వ్యాపారులకు ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి కలిగే తీవ్ర నష్టాలపై అవగాహన కల్పించారు.

తనిఖీల సందర్భంగా సానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇల్లందుల రమేష్ మాట్లాడుతూ, పర్యావరణానికి హానికరమైన ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు, ఇతర నిషేధిత సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ వస్తువులను ఎట్టి పరిస్థితుల్లోనూ వినియోగించవద్దని సూచించారు. ప్లాస్టిక్‌కు బదులుగా వస్త్ర సంచులు, కాగితపు సంచులు వంటి పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను ఉపయోగించాలని వ్యాపారులను కోరారు.

వ్యాపారులకు మార్పు కోసం వారం రోజుల గడువు ఇస్తున్నామని, ఆ తర్వాత కూడా నిషేధిత ప్లాస్టిక్ వినియోగం కొనసాగిస్తే సంబంధిత దుకాణాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు భారీ జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.

ఈ తనిఖీ కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇల్లందుల రమేష్‌తో పాటు జవాన్ కిరణ్ మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# అగ్నిప్రమాద బాధితురాలు రాధమ్మను పరామర్శించిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

- **ప్రభుత్వం తరఫున అన్ని విధాలా సహాయం అందిస్తామని భరోసా**





**వనపర్తి,జూలై14(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద పండ్ల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న రాధమ్మ కుటుంబానికి సోమవారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదం తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. ప్రమాదవశాత్తు ఆమె పండ్ల దుకాణం పూర్తిగా అగ్నికి ఆహుతై, వ్యాపారానికి సంబంధించిన పండ్లు, సామగ్రి పూర్తిగా దగ్ధమయ్యాయి. దీంతో కుటుంబ జీవనాధారం ఒక్కసారిగా కోల్పోయిన రాధమ్మ తీవ్ర ఆవేదనకు గురయ్యారు.ఈ ఘటన విషయం తెలుసుకున్న వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మంగళవారం ఘటన స్థలానికి చేరుకుని కాలిపోయిన దుకాణాన్ని పరిశీలించారు. అగ్నిప్రమాదం ఎలా జరిగిందనే విషయాన్ని అడిగి తెలుసుకుని, బాధితురాలు రాధమ్మతో మాట్లాడి ఆమెను పరామర్శించారు. కుటుంబానికి ఇదే ఏకైక జీవనాధారమని తెలుసుకుని విచారం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాధమ్మ కుటుంబానికి జరిగిన నష్టం ఎంతో బాధాకరమని అన్నారు. జీవనోపాధిని కోల్పోయిన ఈ కుటుంబానికి ప్రభుత్వం తరఫున అన్ని విధాలా సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సంబంధిత అధికారులతో మాట్లాడి బాధిత కుటుంబానికి అవసరమైన ఆర్థిక సహాయం, ఇతర ప్రభుత్వ పరమైన సాయాలు అందించేలా చర్యలు చేపడతామని తెలిపారు.బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.







# డబుల్ ఓట్ల తొలగింపుపై ఆదేశాలు

- **కలెక్టర్ ప్రియాంక క్షేత్రస్థాయి పరిశీలన**
- **ఎన్యూమరేషన్ పత్రాల డిజిటలైజేషన్ వేగవంతం చేయాలి**

**నారాయణపేట, జూలై 14 (తెలంగాణ ముచ్చట్లు):** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా డబుల్ ఓట్లను తొలగించి, మరణించిన ఓటర్ల పేర్లను జాబితా నుంచి శాశ్వతంగా తొలగించాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక అధికారులను ఆదేశించారు. మంగళవారం నారాయణపేట మండలంలోని జిలాల్‌పూర్, పేరపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయాలను సందర్శించిన ఆమె ఎన్యూమరేషన్ ప్రక్రియను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.

ఈ సందర్భంగా బూత్ స్థాయి అధికారులతో మాట్లాడిన కలెక్టర్, ఓటరు జాబితాలో డబుల్ ఓట్లు, మరణించిన వారి పేర్లు ఎన్ని ఉన్నాయో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అటువంటి ఓట్లను నిబంధనల ప్రకారం వెంటనే తొలగించి ఓటరు జాబితాను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాలని సూచించారు.

ఓటర్లు సమర్పించిన ఎన్యూమరేషన్ పత్రాలను ఆలస్యం చేయకుండా వెంటనే డిజిటలైజేషన్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి దరఖాస్తును నిర్దేశిత గడువులోగా యాప్‌లో నమోదు చేసి ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఇంకా ఎన్యూమరేషన్ పత్రాలు సమర్పించని ఓటర్ల వివరాలను గ్రామాల వారీగా సేకరించి వారిని సంప్రదించాలని కలెక్టర్ తెలిపారు. పత్రాలు నింపడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఓటర్లకు బూత్ స్థాయి అధికారులు స్వయంగా సహాయం చేసి అన్ని వివరాలు నమోదు చేసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు.

ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా, అనర్హుల పేర్లు తొలగించేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ పరిశీలనలో డీటీ రామకృష్ణ, రెవెన్యూ శాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పంచాయతీ అధికారులు, బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్ణీత గడువులో పూర్తి చేసి నాణ్యమైన ఓటరు జాబితా సిద్ధం చేయాలని కలెక్టర్ ప్రియాంక అధికారులను ఆదేశించారు.

# ఉపాధి అవకాశాలకు జాబ్ మేళా

- **కలెక్టర్ రాజర్షి షా ప్రారంభం**
- **నియామక పత్రాలు అందజేసిన అధికారులు**

**ఆదిలాబాద్, జూలై 14 (తెలంగాణ ముచ్చట్లు):** నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో జిల్లా ఉపాధి కల్పన శాఖ, శ్రీ అష్టాలక్ష్మి స్పిన్నింగ్ మిల్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఆదిలాబాద్‌లో జాబ్ మేళా నిర్వహించారు. స్థానిక ఎస్టీయూ భవనంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ రాజర్షి షా, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో యువత, నిరుద్యోగులు ఈ జాబ్ మేళాకు హాజరయ్యారు. కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యువతకు ఉపాధి కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రభుత్వ శాఖలు, ప్రైవేట్ సంస్థల సమన్వయంతో ఇలాంటి ఉద్యోగ మేళాలను నిర్వహించడం ద్వారా యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. యువత తమ నైపుణ్యాలను పెంపొందించుకుని అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎంపికైన అభ్యర్థులకు జిల్లా కలెక్టర్ రాజర్షి షా, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష నియామక పత్రాలను అందజేశారు. ఉద్యోగాలు పొందిన యువతను అభినందిస్తూ తమ విధుల్లో అంకితభావంతో పనిచేసి సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు. జాబ్ మేళాను విజయవంతంగా నిర్వహించిన జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారులు, శ్రీ అష్టాలక్ష్మి స్పిన్నింగ్ మిల్ ప్రతినిధులను కలెక్టర్ శాలువాతో సత్కరించి అభినందించారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రైవేట్ సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాలో జిల్లా ఉపాధి కల్పన అధికారి మిల్కా, శ్రీ అష్టాలక్ష్మి స్పిన్నింగ్ మిల్ ప్రతినిధులు విక్రాంత్ కేతన్, గణేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు. వివిధ విభాగాల్లో ఉద్యోగాల కోసం యువత ఇంటర్వ్యూలకు హాజరై తమ ప్రతిభను ప్రదర్శించారు. జిల్లాలో నిరుద్యోగ యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ఇలాంటి జాబ్ మేళాలను నిరంతరం నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.




# హెచ్‌సీఎల్ టెక్‌కు భారీ లాభాలు

**న్యూఢిల్లీ, జులై 14 (తెలంగాణ ముచ్చట్లు):** దేశీయ సమాచార సాంకేతిక సేవల దిగ్గజ సంస్థ హెచ్‌సీఎల్ టెక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో మార్కెట్ అంచనాలను మించి ఆర్థిక ఫలితాలు నమోదు చేసింది. జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో సంస్థ నికర లాభం రూ.4,624 కోట్లకు చేరుకుంది. గత ఏడాది ఇదే కాలంలో నమోదైన రూ.3,843 కోట్లతో పోలిస్తే ఇది దాదాపు 20 శాతం వృద్ధి. సంస్థ ఆదాయం కూడా వార్షిక ప్రాతిపదికన 14 శాతం పెరిగి రూ.34,579 కోట్లకు చేరుకోవడం విశేషం. ఈ ఆర్థిక సంవత్సరం మొత్తం ఆదాయ వృద్ధి అంచనాను గతంలో ప్రకటించిన ఒకటి నుంచి నాలుగు శాతం మధ్యనే కొనసాగిస్తున్నట్లు కంపెనీ వెల్లడించింది. అలాగే వాటాదారులకు ఒక్కో ఈక్విటీ షేరుకు రూ.12 మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది. డివిడెండ్‌కు అర్హులైన వాటాదారుల రికార్డు తేదీగా ఈ నెల 17ను నిర్ణయించగా, ఈ నెల 27 నుంచి చెల్లింపులు చేపట్టనున్నట్లు సంస్థ తెలిపింది.

తొలి త్రైమాసికంలో సంస్థకు మొత్తం 240 కోట్ల డాలర్ల విలువైన కొత్త ఒప్పందాలు లభించాయి. వీటిలో జర్మనీకి చెందిన ప్రముఖ వాహన తయారీ సంస్థ మెర్సిడెస్ బెంజ్‌తో కుదిరిన 114 కోట్ల డాలర్ల కృత్రిమ మేధస్సు ఒప్పందం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సంస్థ చరిత్రలో తొలి త్రైమాసికంలో లభించిన అత్యధిక విలువైన ఆర్డర్లు ఇవేనని హెచ్‌సీఎల్ టెక్ ప్రధాన కార్యనిర్వాహక అధికారి సీ విజయ్‌కుమార్ తెలిపారు. కృత్రిమ మేధస్సు ఆధారిత సేవల ద్వారా కూడా సంస్థకు భారీ ఆదాయం సమకూరింది. గడిచిన మూడు నెలల్లో ఈ విభాగం ద్వారా 17.1 కోట్ల డాలర్ల ఆదాయం వచ్చింది. ఇది గత త్రైమాసికంతో పోలిస్తే 10.6 శాతం, గత ఏడాదితో పోలిస్తే 62.1 శాతం వృద్ధిని నమోదు చేసింది. దీంతో సంస్థ కృత్రిమ మేధస్సు సేవలపై మరింత దృష్టి సారిస్తున్నట్లు స్పష్టమవుతోంది.

అయితే ఉద్యోగుల సంఖ్యలో మాత్రం స్వల్ప తగ్గుదల నమోదైంది. జూన్ త్రైమాసికంలో మొత్తం 3,292 మంది ఉద్యోగులు తగ్గడంతో సంస్థలో ఉద్యోగుల సంఖ్య 2,23,889కు చేరుకుంది. గత రెండేళ్లలో ఒకే త్రైమాసికంలో ఇంత స్థాయిలో ఉద్యోగుల సంఖ్య తగ్గడం ఇదే తొలిసారి. మరోవైపు 1,059 మంది కొత్త అభ్యర్థులను ఉద్యోగాల్లోకి తీసుకున్నట్లు సంస్థ వెల్లడించింది. ఉద్యోగుల వలసల రేటు 12.7 శాతానికి పెరగడం కూడా గమనార్హం.

ఇక దేశంలో కృత్రిమ మేధస్సు మౌలిక సదుపాయాల అభివృద్ధికి పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టనున్నట్లు హెచ్‌సీఎల్ టెక్ ప్రకటించింది. 50 మెగావాట్ల సామర్థ్యంతో కృత్రిమ మేధస్సు డేటా కేంద్రాల ఏర్పాటు కోసం రూ.3,500 కోట్ల పెట్టుబడికి సంస్థ బోర్డు ఆమోదం తెలిపింది. ఇందుకోసం ప్రత్యేక అనుబంధ సంస్థలను ఏర్పాటు చేసి పెట్టుబడులు పెట్టనున్నట్లు వెల్లడించింది. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో కృత్రిమ మేధస్సు ఆధారిత సేవలకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని పూర్తి స్థాయి సేవలను అందించే లక్ష్యంతో సంస్థ ముందుకు సాగుతున్నట్లు పేర్కొంది.



# నష్టాల్లో ముగిసిన దేశీయ మార్కెట్లు

**ముంబై, జులై 14 (తెలంగాణ ముచ్చట్లు):** అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు రావడం, పశ్చిమ ఆసియాలో మరోసారి భౌగోళిక ఉద్రిక్తతలు పెరగడం వంటి పరిణామాల ప్రభావంతో దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం నష్టాల్లో ముగిశాయి. ఉదయం ట్రేడింగ్ ప్రారంభమైనప్పటి నుంచే అమ్మకాల ఒత్తిడి కనిపించడంతో ప్రధాన సూచీలు రోజంతా ఒడిదుడుకులకు లోనయ్యాయి. చివరి వరకు కొనుగోళ్ల మద్దతు ఆశించిన స్థాయిలో లభించకపోవడంతో మార్కెట్లు కోలుకోలేకపోయాయి.

ప్రపంచ మార్కెట్లలో నెలకొన్న అనిశ్చితి, విదేశీ పెట్టుబడిదారుల జాగ్రత్త ధోరణి, అంతర్జాతీయ ముడి చమురు ధరల కదలికలు పెట్టుబడిదారుల సెంటిమెంట్‌ను ప్రభావితం చేశాయి. దీంతో బ్యాంకింగ్, సమాచార సాంకేతిక, లోహ, వాహన, ఆర్థిక సేవల రంగాల షేర్లలో అమ్మకాలు పెరిగాయి. ముఖ్యంగా భారీ మార్కెట్ విలువ కలిగిన కంపెనీల షేర్లు ఒత్తిడికి గురికావడంతో ప్రధాన సూచీలు మరింత దిగజారాయి.

పశ్చిమ ఆసియాలో నెలకొన్న తాజా పరిణామాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపే అవకాశముందనే ఆందోళన కూడా మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపిందని మార్కెట్ వర్గాలు తెలిపాయి. విదేశీ పెట్టుబడిదారులు కొనుగోళ్ల కంటే అమ్మకాలకే మొగ్గు చూపడంతో దేశీయ మార్కెట్లలో ఒత్తిడి మరింత పెరిగింది.

అయితే మధ్యాహ్నం తర్వాత కొన్ని రంగాల్లో కొనుగోళ్లు కనిపించినప్పటికీ, అవి మార్కెట్లను లాభాల బాట పట్టించలేకపోయాయి. ఫలితంగా ట్రేడింగ్ ముగిసే సమయానికి ప్రధాన సూచీలు నష్టాల్లోనే ముగిశాయి. రానున్న రోజుల్లో అంతర్జాతీయ పరిణామాలు, విదేశీ పెట్టుబడుల ప్రవాహం, కంపెనీల త్రైమాసిక ఆర్థిక ఫలితాలపై మార్కెట్ దిశ ఆధారపడే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.




# షాపింగ్ ఆఫర్లకు కోత.. వినియోగదారులకు పెరగనున్న భారం

**న్యూఢిల్లీ, జులై 14 (తెలంగాణ ముచ్చట్లు):** భారీ తగ్గింపులు, నగదు తిరిగి చెల్లింపు వంటి ఆకర్షణీయమైన షాపింగ్ ఆఫర్లు ఇకపై క్రమంగా తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. పెరుగుతున్న ఉత్పత్తి వ్యయాల నేపథ్యంలో కంపెనీలు తమ లాభాలను కాపాడుకునేందుకు ప్రచార ఆఫర్లను కుదించే దిశగా అడుగులు వేస్తున్నాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. గత ఏడాదితో పోలిస్తే ఇప్పటికే అనేక ఉత్పత్తులపై తగ్గింపుల శాతం ఐదు నుంచి ఏడు శాతం వరకు తగ్గినట్లు తెలుస్తోంది. దీంతో వినియోగదారులపై అదనపు భారం పడే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న ఆర్థిక అనిశ్చితి, ముడిసరుకు ధరల పెరుగుదల, విడిభాగాల కొరత, రవాణా వ్యయాల పెరుగుదల వంటి అంశాలు కంపెనీలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. అంతర్జాతీయ ఉద్రిక్తతల కారణంగా సరఫరా వ్యవస్థ కూడా దెబ్బతినడంతో ఉత్పత్తి ఖర్చులు గణనీయంగా పెరిగాయి. ఈ పరిస్థితుల్లో ఖర్చులను నియంత్రించేందుకు సంస్థలు భారీ తగ్గింపులు, ప్రత్యేక ఆఫర్లను తగ్గిస్తున్నాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఈ ప్రభావం రాబోయే రోజుల్లో విద్యుత్ పరికరాలు, గృహోపకరణాలు, దుస్తులు, నిత్యావసర వస్తువులు వంటి అనేక ఉత్పత్తులపై కనిపించే అవకాశం ఉంది. ముఖ్యంగా పండుగల సందర్భంగా వినియోగదారులు ఆశించే భారీ తగ్గింపులు గతంతో పోలిస్తే పరిమితంగా ఉండే అవకాశముందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితులు కొనసాగితే పలు వస్తువుల ధరలు మరింత పెరిగే అవకాశాన్ని నిపుణులు తోసిపుచ్చడం లేదు. అందువల్ల అవసరమైన వస్తువుల కొనుగోలులో వినియోగదారులు ధరలను పోల్చి చూసి, ఆచితూచి నిర్ణయం తీసుకోవడం మంచిదని సూచిస్తున్నారు.



# సెప్టెంబరులో ఐఫోన్ 18 సిరీస్ విడుదల

**న్యూఢిల్లీ, జులై 14 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రముఖ స్మార్ట్‌ఫోన్ తయారీ సంస్థ యాపిల్ నుంచి రానున్న కొత్త ఐఫోన్ 18 సిరీస్‌పై టెక్ ప్రపంచంలో ఆసక్తి నెలకొంది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో ఐఫోన్ 18 ప్రో, ఐఫోన్ 18 ప్రో మాక్స్ మోడళ్లను కంపెనీ ఆవిష్కరించే అవకాశం ఉందని టెక్ వర్గాలు పేర్కొంటున్నాయి. అలాగే యాపిల్ చరిత్రలో తొలిసారిగా మడతపెట్టే ఐఫోన్‌ను కూడా పరిచయం చేసే అవకాశముందనే ప్రచారం జోరుగా సాగుతోంది.

ఈ కొత్త సిరీస్‌లో అత్యాధునిక కృత్రిమ మేధస్సు ఆధారిత సౌకర్యాలు, మరింత మెరుగైన కెమెరా వ్యవస్థ, కొత్త తరం ప్రాసెసర్, అధిక పనితీరు వంటి ఫీచర్లు ఉండే అవకాశముందని సమాచారం. దీంతో ఈ సిరీస్‌పై ప్రపంచవ్యాప్తంగా యాపిల్ అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. అధికారిక ప్రకటన వెలువడకపోయినా, ఇప్పటికే సామాజిక మాధ్యమాలు, టెక్ వర్గాల్లో ఈ ఫోన్లపై చర్చ విస్తృతంగా సాగుతోంది.

అయితే కొత్త సాంకేతికతతో పాటు ధరలు కూడా గణనీయంగా పెరిగే అవకాశముందని మార్కెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. చిప్‌సెట్ల ధరలు పెరగడం, విడిభాగాల సరఫరాలో ఎదురవుతున్న సవాళ్లు, అధునాతన సాంకేతికత వినియోగం కారణంగా ఉత్పత్తి వ్యయం పెరిగినట్లు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో కొత్త ఐఫోన్ సిరీస్ ధరలు గత మోడళ్లతో పోలిస్తే మరింత అధికంగా ఉండే అవకాశం ఉందని చెబుతున్నారు. మార్కెట్ అంచనాల ప్రకారం, భారత మార్కెట్లో ఐఫోన్ 18 ప్రో ప్రారంభ ధర సుమారు రూ.1,39,900గా ఉండవచ్చని, ఐఫోన్ 18 ప్రో మాక్స్ ధర రూ.1,54,900 నుంచి ప్రారంభమయ్యే అవకాశముందని ప్రచారం జరుగుతోంది. అయితే ఈ ధరలపై యాపిల్ నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ధరలు భారీగా ఉండే అవకాశం ఉన్నప్పటికీ, యాపిల్ ఉత్పత్తులకు ఉన్న ఆదరణ దృష్ట్యా కొత్త సిరీస్‌కు కూడా మంచి స్పందన లభించే అవకాశముందని టెక్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అధికారిక ఆవిష్కరణ కార్యక్రమంలో ఫీచర్లు, ధరలు, విక్రయాల తేదీలపై పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.




# థార్ ధరలు మరోసారి పెంపు.. ఏడు నెలల్లో మూడోసారి షాక్

ముంబై, జులై 14 (తెలంగాణ ముచ్చట్లు): ప్రముఖ వాహన తయారీ సంస్థ మహీంద్రా తన ప్రముఖ క్రీడా వినియోగ వాహనం థార్ ధరలను మరోసారి పెంచింది. ఈ ఏడాదిలోనే మూడోసారి ధరలు సవరించిన సంస్థ, జులై 10 నుంచి కొత్త ధరలను అమల్లోకి తీసుకొచ్చింది. తాజా సవరణలతో వివిధ వేరియంట్లపై గరిష్ఠంగా రూ.37 వేల వరకు ధరలు పెరిగాయి. ముడిసరుకు వ్యయం పెరగడం, ఉత్పత్తి ఖర్చులు అధికం కావడమే ధరల పెంపునకు కారణమని కంపెనీ తెలిపింది. ఈ ఏడాది జనవరిలో మొదటిసారిగా థార్ ధరలను దాదాపు రూ.20 వేల వరకు పెంచిన మహీంద్రా, ఏప్రిల్‌లో రెండోసారి గరిష్ఠంగా రూ.43 వేల వరకు సవరించింది. తాజాగా జులైలో మరోసారి ధరలను పెంచడంతో ఏడాది ప్రారంభం నుంచి థార్ కొనుగోలుదారులపై వరుసగా మూడోసారి ధరల భారం పడింది.తాజా సవరణల ప్రకారం అత్యున్నత శ్రేణికి చెందిన నాలుగు చక్రాల డ్రైవ్ 2.2 లీటర్ల డీజిల్ ఆటోమేటిక్ వేరియంట్‌పై అత్యధికంగా రూ.37 వేల పెంపు అమలైంది. నాలుగు చక్రాల డ్రైవ్ పెట్రోల్ ఆటోమేటిక్ వేరియంట్ ధర రూ.36 వేల మేర పెరిగింది. నాలుగు చక్రాల డ్రైవ్ 2.2 లీటర్ల డీజిల్ మాన్యువల్ వేరియంట్‌పై రూ.34 వేల పెంపు ఉండగా, ప్రారంభ శ్రేణి రెండు చక్రాల డ్రైవ్ 1.5 లీటర్ల డీజిల్ మాన్యువల్ వేరియంట్‌పై రూ.32,500 మేర ధర పెరిగింది. కొత్త ధరలు ఇప్పటికే అమల్లోకి వచ్చిన నేపథ్యంలో థార్ కొనుగోలు చేయాలనుకునే వినియోగదారులు తాజా ధరల ప్రకారమే వాహనాన్ని బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. ఉత్పత్తి వ్యయాలు పెరుగుతున్న నేపథ్యంలో భవిష్యత్తులో ఇతర మోడళ్ల ధరలను కూడా సవరించే అవకాశాలు ఉన్నాయని వాహన రంగ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# బ్రిగిడా సాగాకు నిశ్చితార్థం

తమిళ, తెలుగు చిత్ర పరిశ్రమల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న నటి బ్రిగిడా సాగా జీవితంలో కొత్త అధ్యాయం ప్రారంభమైంది. ఇటీవల తన ప్రేమ విషయాన్ని అభిమానులతో పంచుకున్న ఆమె, ఇప్పుడు తన ప్రియుడు అనంత్‌తో నిశ్చితార్థం చేసుకుని మరో శుభవార్తను ప్రకటించింది. కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో జరిగిన ఈ వేడుకకు సంబంధించిన ఫొటోలను బ్రిగిడా స్వయంగా సామాజిక మాధ్యమాల్లో పంచుకోవడంతో అవి క్షణాల్లోనే వైరల్‌గా మారాయి. అభిమానులతో పాటు సినీ ప్రముఖులు కూడా ఈ జంటకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

బ్రిగిడా సాగా తమిళ టెలివిజన్, వెబ్ సిరీస్‌లు, సినిమాల ద్వారా నటిగా మంచి గుర్తింపు సంపాదించింది. తెలుగులో ‘ఆహా కళ్యాణం’ వెబ్ సిరీస్‌తో ప్రేక్షకులకు పరిచయమైన ఆమె, తన సహజ నటనతో ఆకట్టుకుంది. అనంతరం ‘సింధూరం’, ‘పెదకాపు’ వంటి చిత్రాల్లో కీలక పాత్రలు పోషించి తెలుగు ప్రేక్షకులకు మరింత చేరువైంది. విభిన్న పాత్రలను ఎంచుకుంటూ నటిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపును ఏర్పరచుకున్న బ్రిగిడా ప్రస్తుతం తమిళ, తెలుగు భాషల్లో పలు చిత్రాలతో బిజీగా ఉంది.

కొద్ది రోజుల క్రితమే కోలీవుడ్ నటుడు అనంత్‌తో ప్రేమలో ఉన్నట్లు బ్రిగిడా అధికారికంగా ప్రకటించింది. అనంత్ పుట్టినరోజు సందర్భంగా ఆయనతో కలిసి దిగిన చిత్రాలను పంచుకుంటూ తమ ప్రేమను అభిమానులతో పంచుకుంది. ఆ ప్రకటన అనంతరం ఈ జంట పెళ్లి చేసుకోబోతున్నారనే ప్రచారం సాగుతుండగా, తాజాగా నిశ్చితార్థం జరగడంతో ఆ వార్తలకు అధికారిక ముద్ర పడింది. సోమవారం సాయంత్రం అత్యంత సన్నిహితుల సమక్షంలో సంప్రదాయ పద్ధతిలో ఈ వేడుక జరిగినట్లు సమాచారం.

నిశ్చితార్థ వేడుకలో సంప్రదాయ దుస్తుల్లో మెరిసిన బ్రిగిడా, అనంత్ ఎంతో ఆనందంగా కనిపించారు. ఈ సందర్భంగా తీసుకున్న అందమైన చిత్రాలను బ్రిగిడా తన సామాజిక మాధ్యమాల ఖాతాల్లో పంచుకోగా, అభిమానులు భారీగా స్పందిస్తున్నారు. సినీ పరిశ్రమకు చెందిన పలువురు నటీనటులు, దర్శకులు, నిర్మాతలు ఈ జంటకు శుభాకాంక్షలు తెలియజేస్తుండగా, అభిమానులు కూడా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం బ్రిగిడా సాగా నటిగా వరుస అవకాశాలతో బిజీగా కొనసాగుతోంది. ఒకవైపు సినీ జీవితాన్ని విజయవంతంగా కొనసాగిస్తూనే, మరోవైపు వ్యక్తిగత జీవితంలో కూడా కొత్త ప్రయాణాన్ని ప్రారంభించేందుకు సిద్ధమవుతోంది. నిశ్చితార్థం అనంతరం త్వరలోనే వివాహ తేదీని కూడా అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. అభిమానులు ఈ జంటకు శుభాకాంక్షలు తెలుపుతూ వారి వైవాహిక జీవితం ఆనందంగా సాగాలని ఆకాంక్షిస్తున్నారు.



# రాకాలో మరో హీరోయిన్.. మరింత పెరిగిన ఆసక్తి

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న భారీ చిత్రం ‘రాకా’ పై సినీ అభిమానుల్లో రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. విజ్ఞాన కల్పన, భారీ యాక్షన్ అంశాలతో రూపొందుతున్న ఈ చిత్రానికి సంబంధించిన ప్రతి చిన్న సమాచారం కూడా సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారుతోంది. ఇప్పటికే బాలీవుడ్ స్టార్ నటి దీపికా పదుకొణె కథానాయికగా నటిస్తున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. దీంతో ఈ చిత్రంపై దేశవ్యాప్తంగా మరింత ఆసక్తి నెలకొంది.సినిమాలో ఒకరికి మించి పలువురు కథానాయికలు నటించనున్నారనే ప్రచారం గత కొంతకాలంగా కొనసాగుతోంది. మృణాల్ ఠాకూర్, జాన్వీ కపూర్, రష్మిక మందన్న వంటి పలువురు ప్రముఖ నటీమణుల పేర్లు కూడా వినిపించాయి. ఇటీవల మలయాళ నటి ఫెమినా జార్జ్ ఈ చిత్రంలో కీలక పాత్ర పోషిస్తున్నట్లు వెల్లడించగా, ఇప్పుడు మరో కొత్త పేరు అధికారికంగా బయటకు వచ్చింది. పంజాబీ నటి నైలా గ్రేవల్ కూడా ‘రాకా’లో నటిస్తున్నట్లు ప్రకటించడంతో చిత్రంపై ఆసక్తి మరింత పెరిగింది.ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో నైలా గ్రేవల్ మాట్లాడుతూ, దర్శకుడు అట్లీతో కలిసి పని చేయాలనే కోరిక చాలా కాలంగా ఉందని తెలిపింది. ఇప్పుడు ఆ అవకాశం రావడం తనకు ఎంతో ఆనందంగా ఉందని పేర్కొంది. ఇంత పెద్ద స్థాయి చిత్రంలో భాగం కావడం తన సినీ జీవితంలో ప్రత్యేక మైలురాయిగా భావిస్తున్నానని చెప్పింది. దేశవ్యాప్తంగా ప్రేక్షకులను అలరించే భారీ చిత్రంలో అవకాశం దక్కడం గౌరవంగా భావిస్తున్నానని ఆమె వెల్లడించింది.నైలా గ్రేవల్ ఇప్పటికే పలు హిందీ చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు సంపాదించింది. విభిన్న పాత్రల్లో నటిస్తూ తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకున్న ఆమె ఇప్పుడు తెలుగు ప్రేక్షకులకు కూడా చేరువ కానుంది. ఈ భారీ చిత్రంలో ఆమె పాత్రకు కథలో మంచి ప్రాధాన్యం ఉంటుందని సినీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది.ఇప్పటికే ఈ చిత్రంలో పలువురు ప్రముఖ నటీనటులు భాగమవుతుండటంతో కథ ఎలా ఉండబోతోందన్న ఆసక్తి అభిమానుల్లో పెరుగుతోంది. దర్శకుడు అట్లీ తనదైన శైలిలో భావోద్వేగాలు, యాక్షన్, విజ్ఞాన కల్పన అంశాలను మేళవించి ఈ చిత్రాన్ని అత్యంత భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. ప్రతి పాత్రకూ ప్రత్యేక ప్రాధాన్యం ఉండేలా కథను రూపొందిస్తున్నారని తెలుస్తోంది.



# బిగ్‌బాస్‌లోకి కావ్య శ్రీ?.. జోరుగా ప్రచారం

తెలుగు బుల్లితెర ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రముఖ రియాలిటీ కార్యక్రమం ‘బిగ్‌బాస్ తెలుగు’ త్వరలో పదో సీజన్‌తో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే ఈ సీజన్‌ను గత సీజన్ల కంటే మరింత వైవిధ్యంగా, భారీ స్థాయిలో రూపొందిస్తున్నట్లు నిర్వాహకులు సంకేతాలు ఇచ్చారు. వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న అక్కినేని నాగార్జున కూడా ఈసారి కార్యక్రమం కొత్త అనుభూతిని అందిస్తుందని ఇటీవల వెల్లడించడంతో ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరిగింది. దీంతో ఈ సీజన్‌లో పాల్గొనే పోటీదారులు ఎవరనే అంశంపై సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చర్చ సాగుతోంది.

ఈ నేపథ్యంలో ప్రముఖ ధారావాహిక నటి కావ్య శ్రీ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఆమె ఈసారి బిగ్‌బాస్ ఇంట్లోకి అడుగుపెట్టే అవకాశముందని పలు సామాజిక మాధ్యమ వేదికల్లో ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై ఇప్పటివరకు కార్యక్రమ నిర్వాహకులు గానీ, కావ్య శ్రీ గానీ ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. అయినప్పటికీ ఈ ప్రచారం అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది.

ధారావాహికల ద్వారా మంచి గుర్తింపు తెచ్చుకున్న కావ్య శ్రీ తన సహజ నటనతో తెలుగు ప్రేక్షకులకు చేరువయ్యారు. ముఖ్యంగా ‘కోయిలమ్మ’ ధారావాహికతో మంచి పేరు తెచ్చుకున్న ఆమె, అనంతరం ‘చిన్ని’ సీరియల్‌లో పోషించిన పాత్రతో మరింత ఆదరణ పొందారు. ఆ ధారావాహికలో భావోద్వేగాలతో కూడిన పాత్రలో ఆమె నటన ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఆ తర్వాత పెద్దగా కొత్త ధారావాహికల్లో కనిపించకపోయినా, పలు వినోద కార్యక్రమాలు, ప్రత్యేక కార్యక్రమాల్లో పాల్గొంటూ అభిమానులను అలరిస్తున్నారు.

సామాజిక మాధ్యమాల్లో కూడా కావ్య శ్రీ ఎంతో చురుకుగా ఉంటారు. తరచూ కొత్త ఫొటోషూట్లు, వ్యక్తిగత చిత్రాలను అభిమానులతో పంచుకుంటూ ఆకట్టుకుంటున్నారు. ఇటీవల ఆమె పంచుకున్న ఆధునిక దుస్తుల్లోని చిత్రాలు విస్తృతంగా వైరల్ అయ్యాయి. ఈ చిత్రాలు చూసిన అభిమానులు, ఒకవేళ ఆమె బిగ్‌బాస్‌లోకి వస్తే కార్యక్రమానికి మరింత ఆకర్షణ పెరుగుతుందని అభిప్రాయపడుతున్నారు.

గత సీజన్లను పరిశీలిస్తే ధారావాహిక నటీనటులు బిగ్‌బాస్‌లో మంచి ప్రదర్శన కనబరిచిన సందర్భాలు ఉన్నాయి. కొందరు చివరి వరకు పోటీ పడగా, మరికొందరు విజేతలుగా కూడా నిలిచారు. కావ్య శ్రీకి కూడా మంచి అభిమాన వర్గం ఉండటంతో ఆమె నిజంగానే ఈ సీజన్‌లో పాల్గొంటే గట్టి పోటీదారుగా నిలిచే అవకాశముందని బుల్లితెర వర్గాలు భావిస్తున్నాయి.

ఇప్పటికే గత సీజన్‌లో వైల్డ్‌కార్డ్ ద్వారా కావ్య శ్రీ బిగ్‌బాస్‌లోకి వస్తారనే ప్రచారం జరిగినా అది నిజం కాలేదు. ఇప్పుడు మరోసారి ఆమె పేరు ప్రముఖంగా వినిపించడంతో అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అయితే అధికారిక ప్రకటన వెలువడే వరకు ఈ వార్తలను కేవలం ప్రచారంగానే చూడాలని పలువురు సూచిస్తున్నారు. త్వరలో నిర్వాహకులు విడుదల చేసే అధికారిక పోటీదారుల జాబితాతో ఈ అంశంపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# సింగరేణి అధికారులకు భరోసా

(మొదటి పేజీ తరువాయి)



డైరెక్టర్ (పర్సనల్ అండ్ ఫైనాన్స్) గౌతమ్ పోట్రుతో జరిగిన సమావేశంలో అధికారుల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి, ఇంధన భద్రతకు సింగరేణి సంస్థ కీలకమని, కార్మికులు, అధికారులు సంస్థ అభివృద్ధిలో విశేష కృషి చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అధికారుల్లో ఎలాంటి అసంతృప్తి నెలకొనకుండా వారి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. అధికార సంఘం నాయకులతో చర్చించి వారికి భరోసా కల్పించాలని, ఎలాంటి జాప్యం లేకుండా రానున్న రెండు నుంచి మూడు నెలల్లో వారి విజ్ఞప్తులపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేశారు. ఉద్యోగుల సంక్షేమమే సంస్థ అభివృద్ధికి బలమైన పునాదిగా నిలుస్తుందని అన్నారు.

ప్రపంచీకరణ, పెరుగుతున్న పోటీ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని బొగ్గు ఉత్పత్తి, విక్రయాల్లో సింగరేణి పోటీతత్వాన్ని మరింత పెంచాల్సిన అవసరం ఉందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రానున్న రోజుల్లో సింగరేణిని బహుముఖ రంగాల్లో విస్తరించి అంతర్జాతీయ స్థాయి సంస్థగా తీర్చిదిద్దేందుకు అధికారులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. సంస్థ పురోగతికి అధికారులు సానుకూల దృక్పథంతో పనిచేయాలని అధికార సంఘం నాయకులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సింగరేణి అధికార సంఘం అధ్యక్షుడు తాళ్లపల్లి లక్ష్మీపతి గౌడ్, ప్రధాన కార్యదర్శి పెద్ది నరసింహులు ఉప ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కొత్త బొగ్గు బ్లాక్‌ల సాధనతో పాటు అధికారుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం చూపుతున్న చొరవను అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సింగరేణి అభివృద్ధి కార్యక్రమాలకు అధికారుల తరఫున పూర్తి సహకారం అందిస్తూ, సంస్థ సుస్థిరాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని స్పష్టం చేశారు.




# రక్తదానంతో బీఆర్ఎస్ నిరసన

- "మా రక్తం తీసుకో... రైతులకు నీళ్లివ్వు" నినాదాలు
- క్యాంపు కార్యాలయానికి వెళ్తుండగా విద్యార్థి నేతల అరెస్టు

హైదరాబాద్, జూలై 13 (తెలంగాణ ముచ్చట్లు):

కాళేశ్వరం ప్రాజెక్టు, రైతులకు సాగునీటి సరఫరాపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ బీఆర్ఎస్ విద్యార్థి విభాగం, యువజన విభాగం ఆధ్వర్యంలో సోమవారం తెలంగాణ భవన్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, విద్యార్థి నాయకులు హాజరై రక్తదానం చేశారు. ఈ నిరసనను "రక్త దాహం తీర్చేందుకు రక్తదానం" పేరుతో చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు.

రైతులకు కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా వెంటనే సాగునీరు అందించాలని, రాజకీయ విమర్శలకు బదులుగా రైతుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. రైతుల ప్రయోజనాల కోసమే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, అవసరమైతే తమ రక్తాన్ని కూడా అర్పించడానికి సిద్ధమని బీఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. రక్తదాన శిబిరం అనంతరం సేకరించిన రక్త సంచులతో ముఖ్యమంత్రి శిబిర కార్యాలయానికి వెళ్లేందుకు బీఆర్ఎస్ విద్యార్థి నాయకులు ప్రయత్నించారు. అయితే పోలీసులు వారిని మార్గమధ్యంలో అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా అక్కడ స్వల్ప ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసుల చర్యలను నిరసిస్తూ బీఆర్ఎస్ కార్యకర్తలు ముఖ్యమంత్రి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమ శాంతియుత నిరసనను అడ్డుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆరోపించారు. పోలీసుల చర్యలను తీవ్రంగా ఖండిస్తూ ప్రభుత్వం రైతుల సమస్యలపై స్పందించాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంశంపై అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య రాజకీయ విమర్శలు మరింత ముదురుతున్నాయి. ప్రాజెక్టు నిర్వహణ, సాగునీటి సరఫరా, రైతుల ప్రయోజనాల అంశాలపై ఇరు పక్షాలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటూ రాజకీయ వేడిని పెంచుతున్నాయి.

# సర్పంచ్ జ్యోతి బలవన్మరణం

- నిర్మల్ జిల్లాలో విషాద ఘటన
- ఉరేసుకుని ప్రాణాలు తీసుకున్న సర్పంచ్
- కారణాలపై పోలీసుల దర్యాప్తు

నిర్మల్, జూలై 13 (తెలంగాణ ముచ్చట్లు):



నిర్మల్ జిల్లాలో విషాద ఘటన చోటుచేసుకుంది. తానూరు మండలం బోరిగావ్ గ్రామ సర్పంచ్ పల్లె జ్యోతి ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ ఘటన గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపడంతో పాటు స్థానికంగా కలకలం రేపింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

సర్పంచ్ జ్యోతి బలవన్మరణానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని పోలీసులు తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలు లేదా ఇతర వ్యక్తిగత కారణాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో విచారణ కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థుల నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు, అందుబాటులో ఉన్న ఆధారాలను పరిశీలిస్తున్నారు. పోస్టుమార్టం నివేదికతో పాటు దర్యాప్తులో లభించే వివరాల ఆధారంగా తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.





# దేవాదుల పనులకు వేగం

(మొదటి పేజీ తరువాయి)

పాటు నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రాజెక్టు పనులను పరిశీలించారు. హెలికాప్టర్‌లో చేరుకున్న మంత్రులకు జిల్లా అధికారులు ఘన స్వాగతం పలికారు. ప్రాజెక్టు పనుల్లో నిధుల కొరతకు తావు ఉండదని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. 22 రిజర్వాయర్లను పూర్తిస్థాయిలో నింపడంతో పాటు దేవాదుల పంపింగ్ వ్యవస్థను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. ప్రాజెక్టు ద్వారా 38.16 టీఎంసీల నీటి సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించేలా చర్యలు చేపడుతున్నామని, రైతులకు సాగునీటి కొరత లేకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు.

ప్రాజెక్టు పరిధిలోని తుపాకులగూడెం సమ్మక్క-సారలమ్మ బ్యారేజీ వద్ద గోదావరి నీటి ప్రవాహం, నీటి నిల్వలను మంత్రులు పరిశీలించారు. అనంతరం గుట్టల గంగారం సమీపంలోని జె. చొక్కారావు దేవాదుల ప్రాజెక్టు వాటర్ పాయింట్‌ను సందర్శించి మోటార్ల పనితీరు, ఎత్తిపోతల సామర్థ్యం, నీటి సరఫరా పరిస్థితులను అధికారులు వివరించారు. ప్రాజెక్టు సామర్థ్యాన్ని మరింత పెంచే అంశాలపై కూడా చర్చించారు. అనంతరం సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో దేవాదుల ప్రాజెక్టు పెండింగ్ పనులు, భూసేకరణ, ఎత్తిపోతల వ్యవస్థ, సాగునీరు, తాగునీటి సరఫరా, మోటార్ల పనితీరు తదితర అంశాలపై ఇంజినీరింగ్ అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. పనుల్లో ఉన్న అడ్డంకులను వెంటనే తొలగించి, భూసేకరణ ప్రక్రియను కూడా యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని ఉప ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

పెండింగ్ బిల్లులను ఇప్పటికే విడుదల చేసినట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ఎల్‌నినో పరిస్థితులను ముందుగానే అంచనా వేసి కార్యాచరణ అమలు చేస్తున్నామని, గోదావరి జలాలను సమర్థంగా వినియోగించి రైతాంగానికి పూర్తి భరోసా కల్పిస్తామని చెప్పారు. సాగునీరు, తాగునీటి అవసరాలే ప్రభుత్వ తొలి ప్రాధాన్యమని, దేవాదుల ఆయకట్టుకు పూర్తి స్థాయిలో నీరు అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్, సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి లెనిన్ వస్సల్ టోప్పో, అటవీ శాఖ అధికారులు, నీటిపారుదల శాఖ ఇంజినీర్లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రాజెక్టు పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేసి రైతులకు శాశ్వత సాగునీటి భరోసా కల్పించాలని ఉప ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

# యునాని వైద్యానికి ప్రాధాన్యం

- నాణ్యమైన సేవలు అందించాలని ఆదేశం
- ఖాళీల భర్తీ, నిర్మాణాలు వేగవంతం చేయాలని సూచన

హైదరాబాద్, జూలై 13 (తెలంగాణ ముచ్చట్లు):

యునాని వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేసి నాణ్యమైన వైద్యం అందేలా అన్ని స్థాయిల్లో చర్యలు తీసుకోవాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. సచివాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయుష్ శాఖ పనితీరు, నిజామియా టిబ్బీ ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలు, మౌలిక వసతులు, నిర్మాణ పనులు, భవిష్యత్ కార్యాచరణపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. యునాని వైద్యాన్ని మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ప్రభుత్వ నిజామియా టిబ్బీ కళాశాల, నిజామియా జనరల్ ఆస్పత్రి రాష్ట్రంలో యునాని వైద్య సేవలకు ప్రతిష్ఠాత్మక సంస్థలని మంత్రి పేర్కొన్నారు. ఈ సంస్థల అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు.



ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న బయటి రోగుల విభాగం భవనం, ఔషధ నిల్వ భవనం పనులను వేగవంతం చేసి వచ్చే జనవరి నాటికి పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఆస్పత్రిలో వైద్యులు, బోధనా సిబ్బంది, ఇతర ఉద్యోగుల ఖాళీలు ఉండటం వల్ల వైద్య సేవలు, విద్యా కార్యక్రమాలపై ఎలాంటి ప్రభావం పడకుండా వెంటనే ఖాళీల భర్తీకి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలని సూచించారు. యునాని వైద్యశాలలు, ఆస్పత్రుల్లో అవసరమైన మందులు, వైద్య పరికరాలు, మౌలిక సదుపాయాలు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమీక్ష సమావేశంలో ఆయుష్ శాఖ డైరెక్టర్ శ్రీకాంత్ బాబు శాఖ పురోగతిని వివరించారు. గత ఏడాది 138 మంది సహాయ ఆచార్యుల నియామకంతో వైద్యుల కొరత గణనీయంగా తగ్గిందని తెలిపారు. నిజామియా టిబ్బీ కళాశాల, నిజామియా జనరల్ ఆస్పత్రి వారసత్వ భవనాల పునరుద్ధరణతో పాటు కొత్త భవనాల నిర్మాణానికి ప్రభుత్వం రూ.52.50 కోట్లు మంజూరు చేసి పనులు ప్రారంభించినట్లు వెల్లడించారు. యునాని ఔషధాల కొనుగోలు, పంపిణీ కూడా నిరంతరంగా కొనసాగుతోందని తెలిపారు.

శాఖ ఎదుర్కొంటున్న సమస్యలపై మంత్రి ప్రత్యేకంగా ఆరా తీశారు. రాష్ట్ర స్థాయి యునాని ఔషధ తయారీ కేంద్రం ఏర్పాటు కోసం సిద్ధం చేసిన ప్రాజెక్టు ప్రతిపాదనను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. మౌలాలిలోని ప్రభుత్వ యునాని వైద్యశాల భవనానికి సంబంధించిన సమస్యలను పరిశీలించి అక్కడ వైద్య సేవలకు ఎలాంటి అంతరాయం కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో మీర్ జుల్ఫికర్ అలీ, ఆరోగ్యశాఖ ప్రధాన కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, ఆయుష్ శాఖ డైరెక్టర్ శ్రీకాంత్ బాబు, నిజామియా టిబ్బీ ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. యునాని వైద్య సేవలను ఆధునిక అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేసి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు.

# సింగరేణికి కేంద్రం అండ

- తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్ కేటాయింపుపై హర్షం
- బీఆర్ఎస్, కాంగ్రెస్‌పై రామ్‌చందర్‌రావు విమర్శలు

కొత్తగూడెం, జూలై 13 (తెలంగాణ ముచ్చట్లు):

కొత్తగూడెంలో నిర్వహించిన సింగరేణి భరోసా యాత్రలో తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామ్‌చందర్‌రావు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్‌ను సింగరేణి సంస్థకు కేటాయించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిర్ణయం సింగరేణి భవిష్యత్తుకు కీలక మలుపుగా నిలుస్తుందని పేర్కొన్నారు. గతంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు సింగరేణిని నిర్లక్ష్యం చేశాయని, కార్మికుల ప్రయోజనాలను పట్టించుకోలేదని రామ్‌చందర్‌రావు ఆరోపించారు. సంస్థను అప్పుల భారంలోకి నెట్టి, అనిశ్చిత పరిస్థితుల్లోకి తీసుకెళ్లారని విమర్శించారు. కార్మికుల సంక్షేమం కంటే రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇచ్చారని అన్నారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర బొగ్గు శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి చేసిన కృషి ఫలితంగానే నైని, తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్‌లు సింగరేణి సంస్థకు కేటాయించబడ్డాయని ఆయన తెలిపారు. ఈ నిర్ణయం కేంద్ర ప్రభుత్వానికి సింగరేణి కార్మికులపై ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్ కేటాయింపుతో సింగరేణి సంస్థ ఆర్థిక పరిస్థితి మరింత బలోపేతం అవుతుందని రామ్‌చందర్‌రావు అభిప్రాయపడ్డారు. బొగ్గు ఉత్పత్తి పెరగడంతో పాటు సంస్థ ఆదాయం కూడా వృద్ధి చెందుతుందని, దీని వల్ల సంస్థ మరింత బలపడే అవకాశాలు ఉన్నాయని వివరించారు.

ఈ నిర్ణయం ద్వారా కొత్త ఉపాధి అవకాశాలు కూడా సృష్టించబడతాయని ఆయన అన్నారు. రాబోయే దశాబ్దాల పాటు వేలాది మంది సింగరేణి కార్మికులు, వారి కుటుంబాలకు ఉపాధి భరోసా లభిస్తుందని, బొగ్గు పరిశ్రమ అభివృద్ధికి ఇది కీలక నిర్ణయంగా నిలుస్తుందని పేర్కొన్నారు. సింగరేణి సంస్థ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తోందని రామ్‌చందర్‌రావు తెలిపారు. కార్మికుల సంక్షేమం, సంస్థ విస్తరణ, బొగ్గు ఉత్పత్తి పెంపు లక్ష్యంగా మరిన్ని చర్యలు చేపడతామని పేర్కొంటూ, సింగరేణి మరింత అభివృద్ధి చెందేలా కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందని వెల్లడించారు.





తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక




# ఓరుగల్లు ఆడబిడ్డ కలకు అండగా నిలుద్దాం..

# వెంకట్రామయ్య గారి తాలూకాను విజయవంతం చేద్దాం



హీరో దినేష్ కుమార్, కథానాయికగా పరిచయమవుతున్న దివిజ ప్రభాకర్ జంటగా నటిస్తున్న "వెంకట్రామయ్య గారి తాలూకా" చిత్రానికి సతీష్ ఆవాల దర్శకత్వం వహించారు. గ్రామీణ జీవితం, కుటుంబ బంధాలు, తల్లిదండ్రుల ప్రేమ, మానవీయ విలువలను హృదయాన్ని హత్తుకునేలా వెండితెరపై ఆవిష్కరించే ప్రయత్నం చేశారు. ప్రతి పాత్ర కథలో సహజంగా మిళితమయ్యేలా, ప్రేక్షకుడు తన జీవితాన్ని తెరపై చూసే అనుభూతి కలిగేలా చిత్రాన్ని మలిచారు. దినేష్ కుమార్, దివిజ ప్రభాకర్ తమ పాత్రల్లో ఒదిగిపోయి సహజమైన అభినయంతో ఆకట్టుకునేలా కనిపిస్తున్నారు. ముఖ్యంగా భావోద్వేగ సన్నివేశాలు, కుటుంబ అనుబంధాలను ప్రతిబింబించే నటన, పల్లె నేపథ్యం ఈ చిత్రానికి ప్రధాన బలంగా నిలుస్తాయని ట్రైలర్, ప్రచార చిత్రాలు స్పష్టం చేస్తున్నాయి. కోమలి క్రియేషన్స్ పతాకంపై కోమలి మహేందర్ తొట్టె, సోమేష్ సారిపల్లి సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం మంచి కథ, జీవం ఉన్న పాత్రలు, కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే భావోద్వేగాలతో రూపొందింది. జులై 17న ప్రేక్షకుల ముందుకు రానున్న "వెంకట్రామయ్య గారి తాలూకా" ప్రతి కుటుంబం కలిసి చూడదగ్గ చిత్రంగా నిలుస్తుందనే నమ్మకాన్ని కలిగిస్తోంది.





## జానపద గాయని నుంచి నిర్మాత వరకు...

## కోమలి స్ఫూర్తిదాయక ప్రయాణం

## (ప్రత్యేక కథనం)

## సారంగధరియా సాంగ్ తో ఫేమ్

**హన్మకొండ,జులై14(తెలంగాణ ముచ్చట్లు):**

ప్రతిభకు ప్రాంతాలు ఉండవు. అవకాశాలకు అడ్డులు ఉండవు. కానీ ఒక కలను నిజం చేయాలంటే ధైర్యం, పట్టుదల, ఆత్మవిశ్వాసం తప్పనిసరి. అలాంటి అరుదైన ప్రయాణమే ఓరుగల్లు ఆడబిడ్డ కోమలిది.

చెమట చుక్కల నుంచి... చిరునవ్వుల హరివిల్లు నుంచి... పుడమి తల్లి పులకరింత నుంచి పుట్టిందే తెలంగాణ జానపదం. ఆ జానపదానికి తన గాత్రంతో కొత్త ఊపిరి పోసిన గాయని కోమలి, ఇప్పుడు నిర్మాతగా వెండితెరపై మరో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించింది. పాటలతో ప్రజల హృదయాలను గెలుచుకున్న ఆమె, "వెంకట్రామయ్య గారి తాలూకా" చిత్రంతో సినీ నిర్మాణ రంగంలో అడుగుపెట్టి తన కలను సాకారం చేసుకుంది.

మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం ఇంటికన్నె గ్రామంలో నిరుపేద రైతు కుటుంబంలో జన్మించిన కోమలి చిన్నప్పటి నుంచే జీవిత పోరాటాన్ని చూసింది. కానీ కష్టాలు ఆమె ప్రతిభను అడ్డుకోలేకపోయాయి.



ఆరో తరగతిలోనే హనుమకొం డలో జరిగిన పోటీల్లో తొలి బహుమతి అందుకున్న ఆమె, 2010లో టి న్యూస్ నిర్వహించిన "రేలారే రేలా" కార్యక్రమంలో ప్రథమ స్థానం సాధించింది. అనంతరం హెచ్ఎంటీవీ "మారుమోగిన పాట" కార్యక్రమం ద్వారా మరింత గుర్తింపు పొందింది.హనుమకొండ జిల్లా జానకిపురం గ్రామానికి కోడలిగా వెళ్లిన తర్వాత కూడా ఆమె జీవితం సాఫీగా సాగలేదు. ఎన్నో కష్టాలు, అవమానాలు, ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా భర్త తొట్టె మహేందర్ అండతో వ్యవసాయం చేస్తూనే సంగీత ప్రయాణాన్ని కొనసాగించింది. కుటుంబ బంధాలు, గ్రామీణ జీవితం, భావోద్వేగాలను ప్రతిబింబించే పాటలతో యూట్యూబ్ ద్వారా లక్షలాది మంది అభిమానులను సంపాదించింది.

ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పొందిన "సారంగదరియా" జానపద బాణీకి విస్తృత గుర్తింపు తీసుకురావడంలో కోమలి పాత్ర విశేషం. అంతేకాదు "బాలంతరళ బైలెల్లు", "కలిగినోరింట్లకు నన్నిచ్చినవా", "జాజిమల్లె పువ్వులో", "పాప బలాగం", "మదన సుందరి" వంటి అనేక జానపద గీతాలతో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. ఆమె గాత్రం వినిపిస్తే చప్పట్లు ఆగవని పేరు తెచ్చుకుంది.

పాటలతోనే కాదు... జీవితంతోనూ స్ఫూర్తిగా నిలిచిన కోమలి ఇప్పుడు నిర్మాతగా తనను తాను మరోసారి నిరూపించుకునే ప్రయత్నం చేసింది. తాను అనుభవించిన జీవితం, గ్రామీణ సంస్కృతి, కుటుంబ బంధాలు, మానవ విలువలను కథగా మలిచి "వెంకట్రామయ్య గారి తాలూకా" చిత్రాన్ని నిర్మించింది.

### మన కథ... మన మనుషులు... మన భావోద్వేగాలు

ఒక మనిషి పేరు... ఒక కుటుంబ గౌరవం... ఒక ఊరి ఆత్మగౌరవం... ఇవన్నీ ఒకే కథలో ముడిపడితే ఎలా ఉంటుంది? అలాంటి భావోద్వేగాల సమాహారమే "వెంకట్రామయ్య గారి తాలూకా".

కుటుంబ అనుబంధాలు, గ్రామీణ జీవనశైలి, మనుషుల మధ్య బంధాలు, ఆత్మీయతలు, విలువలను హృదయానికి హత్తుకునేలా ఈ చిత్రం ఆవిష్కరిస్తుంది. సందేశం చెప్పాలనే ఉద్దేశంతో కాకుండా, జీవితాన్నే యథాతథంగా వెండితెరపై ఆవిష్కరించే ప్రయత్నం చేసిన చిత్రంగా ఇది కనిపిస్తోంది. నవ్వించే క్షణాలు, కదిలించే భావోద్వేగాలు, ప్రతి కుటుంబం కలిసి ఆస్వాదించే కథనం ఈ చిత్రానికి ప్రధాన బలంగా నిలుస్తుందని ట్రైలర్ చూస్తేనే అర్థమవుతోంది.తెలుగు నేల వాసనను, పల్లె మనుషుల మనసును, బంధాల గొప్పతనాన్ని ఆవిష్కరించే ఈ చిత్రం ప్రతి ప్రేక్షకుడిని తన జీవితంతో ముడిపడేలా చేసే శక్తి కలిగి ఉందనే నమ్మకం కలుగుతోంది. ఇది కేవలం ఒక సినిమా కాదు... ప్రతి కుటుంబం కలిసి చూసి ఆస్వాదించదగ్గ అనుభూతి.

### ఓరుగల్లు ప్రజలారా... ఇప్పుడు మన వంతు!

సినిమా బాగుందా? లేదా? అన్నది చూసిన ప్రేక్షకుడే నిర్ణయిస్తాడు. కానీ మన ప్రాంతం నుంచి ఎదిగిన ప్రతిభను ప్రోత్సహించడం మాత్రం మనందరి బాధ్యత. ఒక టికెట్ కొనడం అంటే కేవలం సినిమా చూడడం మాత్రమే కాదు... ఒక మహిళ కలకు అండగా నిలవడం... ఒక కళాకారిణి ధైర్యాన్ని అభినందించడం... మన నేల ప్రతిభను గౌరవించడం.

ఉమ్మడి వరంగల్ జిల్లాకు కళలకు, సాహిత్యానికి, సంస్కృతికి గొప్ప చరిత్ర ఉంది. అదే నేలపై పుట్టి ఎదిగిన కోమలి నిర్మాతగా తన తొలి చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తోంది. ఈ చిత్రం విజయం సాధిస్తే అది కోమలి విజయమే కాదు... ఓరుగల్లు గడ్డ గెలుపు కూడా.

> "ఓరుగల్లు ప్రజలారా... కుటుంబ సభ్యులతో కలిసి థియేటర్‌కు వెళ్లి "వెంకట్రామయ్య గారి తాలూకా"ను వీక్షించండి. ఒక మంచి కథను ఆదరించండి. ఒక ఆడబిడ్డ కలకు అండగా నిలవండి.పాట ఆమెకు ప్రాణం... పోరాటం ఆమెకు బలం... కష్టం ఆమెకు గురువు... విజయం ఆమెకు గమ్యం."వెంకట్రామయ్య గారి తాలూకా" కేవలం ఒక సినిమా కాదు... ఒక జానపద గాయని కన్న కల... ఒక మహిళ సాధించిన విజయం... ఓరుగల్లు గర్వించే మరో విజయగాథ.



Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in